క్లుప్తంగా

'అనూహ్యం'కు తృతీయ బహుమతి


అనూహ్యం నాటికలో కామెడీ సన్నివేశం

పాలకొల్లు సెంట్రల్: వీరవాసరం కళాపరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 24 నుంచి 27 వరకు నిర్వహించిన జాతీయ స్థాయి నాటిక పోటీల్లో పాలకొల్లు నటీ నట సంక్షేమ సమాఖ్య కళాకారులు నటించిన అనూహ్యం నాటిక ఉత్తమ తృతీయ బహుమతి గెలుచుకుంది. ఇంకా ఉత్తమ ద్వితీయ నటుడు, ఉత్తమ హాస్య నటుడు, ఉత్తమ క్యారెక్టర్ నటిగా బహుమతులు అందుకున్నారు. ఈ నాటిక రచన తాళాబత్తుల వెంకటేశ్వరరావు, దర్శకత్వం కత్తుల రామమోహనరావులు వహించగా గుడాల హరిబాబు, మాదిరెడ్డి శ్రీనివాస్, బి.శ్యాంశేఖర్, ఎస్ జ్యోతి రాణి నటించారు. ఉత్తమ బహుమతి అందుకున్న కళాకారులను పట్టణ కళాకారులు, కళాపరిషత్ సభ్యులు అభినందనలు తెలిపారు.

నిత్యావసర సరుకుల పంపిణీ


నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం

నరసాపురం: షాలేమ్ సామాజిక స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపకుడు, మాదిగ సంఘ రాష్ట్ర నాయకుడు తెన్నేటి సురేష్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని 1వ వార్డు లాకుపేటలో పేదలకు బియ్యం, పప్పు దినుసులు పంపిణీ చేశారు. గత 25 ఏళ్లుగా తమ సంస్థ ద్వారా వివిధ కార్యక్రమాలతోపాటు అన్నదానాలు, వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని సురేష్ తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు రత్నకుమారి, బప్పులూరి సునీత, ముసూడి కుమారి పాల్గొన్నారు.

రేపు పాలకొల్లులో కవి సమ్మేళనం


కవితలను పరిశీలిస్తున్న రసదుని సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: విశ్వావసు నామ సంవత్సరం ఉగాది పర్వదినం సందర్భంగా ఈ నెల 30న స్థానిక చినగోపురం వీధిలో బంగారు వారి శ్రీ వాసవి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో కవి సమ్మేళనం నిర్వహించనున్నట్టు రసదుని అధ్యక్షుడు కొట్టి భాస్కరరావు తెలిపారు. ఇటీవల ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయిలో నిర్వహించిన కవితా పోటీల్లో ఉన్న మట్ల ప్రేమ్ కుమార్ (కొంతేరు) ప్రథమ, జవ్వాది దాశరథి శ్రీనివాస్ (భీమవరం) ద్వితీయ, చిలుకూరి సూర్యప్రసాద్ (యలమంచిలి) తృతీయ స్థానాల్లో నిలిచారని, ఉప్పల వెంకటాచార్యులు (జంగారెడ్డిగూడెం), ఎస్కే నాగేశ్వరరావు (పెనుగొండ), పాప్పొప్పు విజయలక్ష్మి (తణుకు) ప్రోత్సాహక బహుమతులకు ఎంపికయ్యారని తెలిపారు. వీరికి కవిసమ్మేళనంలో బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో యర్రంశెట్టి వెంకటరత్నం, మామిడిశెట్టి పెద్దిరాజు, ఎం కృష్ణప్రసాద్‌లు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన


వాటర్ ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

పెనుగొండ: అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. శుక్రవారం పెనుగొండ కోడి పందేల దిబ్బలో వాటర్ ట్యాంకు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం పంచాయతీ పార్కులో వాకింగ్ ట్రాక్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పోడూరి గోవర్ధన, సర్పంచ్ నక్కా శ్యామలా సోనీ శాస్త్రి, వెలిచేటి బాబూరాజేంద్ర ప్రసాద్, కొండవీటి శ్రీనివాసరావు, గుర్రాల సూరిబాబు, వేండ్ర రాము, కటికిరెడ్డి నానాజీ, నక్కా వినోద్ కుమార్ శర్మ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మార్కెట్ పాట మళ్లీ వాయిదా

నరసాపురం: మున్సిపల్ మార్కెట్‌లో రోజువారీ పన్నుల వసూళ్లకు సంబంధించి శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన బహిరంగ వేలంపాట మరోసారి వాయిదా పడింది. పాటదారులు ముందుకు రాకపోవడంతో పాటను శనివారం నాటికి వాయిదా వేస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ ఎం అంజయ్య ప్రకటించారు. పాట ఇప్పటికి రెండుసార్లు వాయిదా పడిందని, దీంతో శనివారం సీల్డ్‌టెండర్ బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు కమిషనర్ చెప్పారు.

యలమంచిలి ఎంపీపీ ఎన్నిక మళ్లీ వాయిదా

తీవ్ర నాటకీయ పరిణామాలు

యలమంచిలి: అధికార పార్టీ నాయకుల స్క్రిప్ట్‌ను అధికారులు తూచా తప్పకుండా పాటిస్తూ నాటకీయ పరిణామాల మధ్య యలమంచిలి ఎంపీపీ ఉప ఎన్నికను రెండో రోజు కూడా వాయిదా వేశారు. తొలి రోజు మాదిరిగానే ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్‌తో కలిసి వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యులు సమావేశానికి వెళ్లారు. వారితోపాటే టీడీపీ, జనసేన ఎంపీటీసీ సభ్యులు కూడా హాజరయ్యారు. వీరంతా తొలిరోజు చెప్పినట్టే వైఎస్సార్ సీపీ నాయకులు మమ్మల్ని బెదిరిస్తున్నారని చెప్పడంతో ఎన్నికల అధికారి ఎం శ్రీనివాస్‌కు ఏం చేయాలో తెలియక తనకు గుండెలో నొప్పిగా ఉందని బయటకొచ్చేశారు. వెంటనే టీడీపీ, జనసేన ఎంపీటీసీ సభ్యులు ఎంపీపీ ఎన్నిక వాయిదా అంటూ బయటకొచ్చేశారు. కోరం ఉన్నందున ఎన్నిక నిర్వహించాలని వైఎస్సార్ సీపీ సభ్యులు కోరినా సహాయ ఎన్నికల అధికారి ఎంపీడీఓ నందిపాటి ప్రేమాన్విత సమాధానం చెప్పకుండా ఉండిపోయారు. సుమారు రెండు గంటల అనంతరం ఎన్నికల అధికారి వచ్చి సభలో వాగ్వాదం కారణంగా ఎన్నిక నిర్వహించే పరిస్థితి లేదని, విషయాన్ని ఎన్నికల సంఘానికి చెప్తానని లిఖిత పూర్వకంగా ఒక కాగితం ఇచ్చి మళ్లీ కిందికి వెళ్లియారు. దీంతో ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్‌తోపాటు వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యులంతా వెనుదిరిగారు.


మండల పరిషత్ కార్యాలయం నుంచి ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్‌తో కలిసి బయటకొస్తున్న వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యులు

ఎన్నికల అధికారి హైడ్రామా

ఎంపీపీ ఎన్నిక సమయంలో గుండెలో నొప్పిగా ఉందని ఎన్నికల అధికారి ఎం శ్రీనివాస్ కిందకు వచ్చి ఎంపీపీ చాంబర్‌లో ఉండిపోయారు. అక్కడే ఉన్న ఆర్డీఓ దాసి రాజు ఆయనకు వైద్యం చేయించారు. తరువాత శ్రీనివాస్ సభ్యులకు లికిత పూర్వక పత్రం ఇచ్చి మళ్లీ ఎంపీపీ చాంబర్‌కు వెళ్లిపోయారు. ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్‌తోపాటు వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యులంతా వెళ్లిపోయిన తరువాత మళ్లీ నాటకానికి తెరలేపారు. ఎన్నికల అధికారి శ్రీనివాస్‌కు సీరియస్‌గా ఉందని చెప్పి కొంచెం సమయం కార్యాలయం ప్రధాన ద్వారం మూసివేశారు. విలేకరులకు లోపలకు ప్రవేశం లేదంటూ ఇన్‌చార్జి తహసీల్దార్ నరేష్ గేటు వద్ద హల్‌చల్ చేశారు. ఎన్నిక వాయిదాపై విలేకరులు ప్రశ్నించగా ఎంపీడీఓ, ఆర్డీఓ దాసి రాజు సమాధానం దాటవేశారు. అనంతరం సీసీ కెమెరాలో పడే విధంగా 108 వాహనంలో ఎన్నికల అధికారి శ్రీనివాస్‌ను ఎక్కించారు. సీసీ కెమెరాల పరిధి దాటి సుమారు అర కిలోమీటరు వెళ్లిన తరువాత ఆయన 108 వాహనం నుంచి దిగి నేరుగా తన కారులో ఎక్కి ఇంటికి వెళ్లిపోయారు. వైఎస్సార్ సీపీ సభ్యులు కోర్టుకు వెళితే కోర్టుకు ఆధారాలు చూపించేందుకే ఈ హైడ్రామా ఆడారని అక్కడున్న వారంతా మాట్లాడుకున్నారు.

మమ్మల్ని కొనలేరు

వైఎస్సార్ సీపీ నిజమైన అభిమానులను కొనలేరని నిరూపించారు. యలమంచిలి మండలంలోని 12 మంది వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యులు. ఎంపీపీ ఎన్నికకు నోటిఫికేషన్ రాక ముందే టీడీపీ నాయకులు ఎంపీపీ పీఠాన్ని చేజిక్కించుకోవాలని ఎత్తుగడ వేశారు. వైఎస్సార్ సీపీ 12 మంది ఎంపీటీసీ సభ్యుల ఇళ్లకు టీడీపీ నాయకులు వెళ్లారు. వచ్చే సర్పంచ్ ఎన్నికల్లో సర్పంచ్ చేస్తామని, ఏఎంసీ డైరెక్టర్ ఇస్తామని, టీడీపీ గ్రామ ఇన్‌చార్జి చేసి, గ్రామంలో పనులు చేస్తామని, అడిగినంత సొమ్ము ఇస్తామని, కాంట్రాక్టులు ఇస్తామని ఇలా అనేక రకాలుగా ప్రలోభాలకు గురి చేశారు. అయినా వారి మాట వినకపోవడంతో అధికారులను ఉపయోగించి కుట్ర మాటలతో ఎంపీపీ ఎన్నిక వాయిదా వేయించారు.

సామూహిక కుంకుమ పూజలు


కుంకుమ పూజ చేస్తున్న మహిళలు

యలమంచిలి: ఉగాది సందర్భంగా అడవిపాలెం గ్రామ దేవత కనకదుర్గమ్మ ఆలయంలో శుక్రవారం సామూహిక కుంకుమ పూజలు చేశారు. అర్చకుడు సుదర్శనం శ్రీనివాసచార్యులు బ్రహ్మత్వంలో జరిగిన ఈ పూజల్లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. మహిళలందరికీ కుంకుమతోపాటు ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం ఇంటింటికి వెళ్లి హారతి తీసుకునే కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు తలుకూరి వీరేంద్ర, తలుపూరి వీర వెంకట సత్యనారాయణ కొండ నిర్వహించారు. శనివారం రాత్రి గ్రామానికి తూర్పు వైపు గమనలగుడుపు, జాతర, 30న ఉగాది సందర్భంగా పడమర వైపు జాతర, 31న పడమర వైపు నుంచి తడి చీరలపై కనకదుర్గమ్మ ఘటాలను ఆలయానికి తీసుకొచ్చి ఉయ్యాల నిర్వహించిన, అనంతరం ఘటాలను ఆలయ ప్రవేశం చేయడంతో ఈ ఏడాది ఉగాది ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు బొలిశెట్టి రావులియ్య, పితాని శ్రీనివాసరావులు తెలిపారు.

పెనుగొండలో సమస్యల ఏకరువు

పెనుగొండ: పెనుగొండలో శుక్రవారం నిర్వహించిన గ్రామాభివృద్ధి సభలో ప్రజా ప్రతినిధులు, గ్రామస్థులు సమస్యలు ఏకరువు పెట్టారు. డెప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తండ్రి వెంకట్రావు సొంత గ్రామం కావడంతో ఆయన కుటుంబ మూలాలు ఉన్న పెనుగొండను ప్రత్యేక శ్రద్ధతో అభివృద్ధి చేయడానికి అర్జీలు స్వీకరించాలని పంచాయతీ రాజ్ శాఖ పేషీ అధికారులను పవన్ కల్యాణ్ ఆదేశించారు. దీంతో శుక్రవారం సాయంత్రం పెనుగొండ టీటీడీ కల్యాణ మండపంలో సభ ఏర్పాటుచేశారు. డ్రెయినేజీ సమస్యతో సతమతం అవుతున్నామని, భూగర్భ డ్రెయినేజీ నిర్మాణానికి సహకరించాలి కోరారు. పెనుగొండ మురుగు పంట కాలువల్లోకి రాకుండా, నేరుగా కిలో మీటరు దూరంలో ఉన్న నక్కల డ్రెయిన్‌లోకి మళ్లించాలని అన్నారు. పెనుగొండ కళాశాల వద్ద కార్లు, భారీ వాహనాలు వెళ్లే విధంగా జడ్ వంతెన నిర్మించాలని కోరారు. పెనుగొండ – మార్టేరు కాలువ గట్టు రహదారి అభివృద్ధి చేయాలని, బీడు రోడ్డు నిర్మాణం చేపట్టాలని అన్నారు.


పెనుగొండ సభలో పాల్గొన్న డెప్యూటీ సీఎం పేషీ అధికారులు, ప్రజా ప్రతినిధులు

పారిశ్రామిక పట్టణంగా తీర్చిదిద్దాలి

తొలి పారిశ్రామిక పట్టణంగా పెనుగొండకు ఖ్యాతి ఉందని వివరించారు. ఇనుము ఫ్యాక్టరీ పెనుగొండలో ఉన్న కాలంలో సుమారు 500 మంది కార్మికులు పని చేసే వారని తెలిపారు. ప్రభుత్వ ప్రణాళికలో భాగంగా పెనుగొండను పారిశ్రామిక పట్టణంగా తీర్చిదిద్దాలని, ఇంజినీరింగ్ కళాశాల నెలకొల్పాలని, ప్రభుత్వ విద్యా సంస్థలు ఏర్పాటు చేయాలని కోరారు. సిద్ధాంతంలో వశిష్టా గోదావరిలో కైలాస భూమి అభివృద్ధి చేయాలని, పెనుగొండలో శ్మశాన వాటిక, ఎస్సీ శ్మశాన వాటికలను అభివృద్ధి చేయాలని అన్నారు. డంపింగ్ యార్డుకు రెండున్నర ఎకరాలు కేటాయించి, నిధులు మంజూరు చేయాలని కోరారు.

ఆధ్యాత్మిక శోభ తేవాలి

పెనుగొండకు ఆధ్యాత్మిక శోభను తీసుకురావాలని పలువురు కోరారు. గ్రీన్ సిటీగా తీర్చిదిద్ది వాసవీ ఆలయ పరిసర ప్రాంతాలను అభివృద్ధి చేయాలని, కళాశాల వద్ద అధునాతన బస్టాండు నిర్మాణం చేపట్టి యాత్రికుల సంఖ్య పెంచాలని కోరారు.

డెప్యూటీ సీఎంకు నివేదిస్తా

పెనుగొండ అభివృద్ధికి వచ్చిన వినతులపై నివేదిక తయారుచేసి డెప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు నివేదిస్తామని పంచాయతీ రాజ్ కమిషనర్ కృష్ణతేజ తెలిపారు. సమస్యలను డెప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు వివరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, జాయింట్ కలెక్టరు రాహుల్ రెడ్డి, డెప్యూటీ సీఎం ఓఎస్‌డీ వెంకటకృష్ణ, జెడ్పీటీసీ పోడూరి గోవర్ధన, సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ శాస్త్రి, డీపీఓ అరుణ శ్రీ, డెప్యూటీ సీఎం పీఎస్ మధుసూధన్, ఏసీఎఫ్ శివరామకృష్ణ, బాలకృష, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కాలువల ప్రక్షాళన చేయాలి

నరసాపురం రూరల్: మొగల్తూరు పంచాయతీ పరిధిలో అపరిష్కృతంగా ఉన్న కోనాయికోడు, మొగల్తూరు ప్రధాన కాలువలను ప్రక్షాళన చేయాలని గ్రామస్తులు కోరారు. శుక్రవారం గ్రామంలో నిర్వహించిన గ్రామ అభివృద్ధి సభలో స్థానిక సమస్యలను అధికారులకు వివరించారు. గ్రామంలో పూర్తిస్థాయిలో డ్రెయినేజీ నిర్మించాలని, పంచాయతీకి డంపింగ్ యార్డ్‌కు అనవరమైన స్థలాన్ని కేటాయించాలని, దర్భరేవు డ్రెయిన్ ప్రక్షాళన చేయాలని విన్నవించారు. సభలో పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ ఎం కృష్ణతేజ మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. పలువురు ప్రస్తుత, మాజీ సర్పంచులు స్థానిక సమస్యలను ఈ సందర్భంగా వివరించారు. సభలో ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, జేసీ రాహుల్ కిషోర్, డీపీఓ అరుణశ్రీ, తహసీల్దార్ కె.రాజ్‌కిషోర్, ఎంపీడీఓ సీహెచ్ త్రిశూలపాణి, పంచాయతీ కార్యదర్శి ముచ్చర్ల నాగేశ్వరరావు, గ్రామ సర్పంచ్ పడవల మేరీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


గ్రామ సభలో మాట్లాడుతున్న పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కృష్ణ తేజ

నేటి నుంచి ఉగాది ఉత్సవాలు


దానమ్మవారు

పెనుమంట్ర: మండలంలోని సోమరాజు ఎల్లిందిలపర్రు గ్రామంలో 180 సంవత్సరాలకు పైగా చరిత్ర గల దానమ్మ ఉగాది సంబరాలు ఈనెల 29 నుంచి ఏప్రిల్ 1 వరకు వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు, ఎంపీపీ కర్రి వెంకటనారాయణ రెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. శనివారం రాత్రి అమ్మవారి ఊరేగింపుతో ఉత్సవాలు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. వచ్చే నెల 5న ఆలయ ఆవరణలో ఉదయం భారీ అన్నసమారాధన ఉంటుందని తెలిపారు. పరిసర గ్రామాల భక్తులంతా పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

పండుగలే మన సంస్కృతి

భీమవరం (ప్రకాశంచౌక్): కొత్త సంవత్సరం ఆరంభమవుతుందని, ఈ ఏడాది అందరి జీవితాల్లో కొత్త ఆశ, సంతోషం నింపాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో కలెక్టర్ నాగరాణి ఉగాది వేడుకల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. మన సంస్కృతి, సంపద మన పండుగలని, సాంప్రదాయాలు యుగాంతం వరకు చెరగని ముద్రలని, భీమవరంలో 36 ఏళ్లగా ఉగాది వేడుకలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. నిర్వాహకులు కంతేటి వెంకటరాజు, చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఈ నెల 30న భీమేశ్వర స్వామి దేవస్థానంలో ఉగాది వేడుకలను నిర్వహిస్తున్నామని, 50 మంది విశిష్ట సేవాతత్పరులకు ఉగాది పురస్కారాలను అందిస్తున్నామని తెలిపారు.

ప్లాస్టిక్ కవర్లను వాడితే చర్యలు

భీమవరం (ప్రకాశంచౌక్): వ్యాపారస్తులు ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వరరావు, ప్లాస్టిక్ నిషేధ కమిటీ సభ్యులు కంతేటి వెంకటరాజు, చెరుకువాడ రంగసాయి హెచ్చరించారు. జేపీ రోడ్డులోని హాట్ లైన్స్ వీధిలో పలు షాపులను శుక్రవారం తనిఖీ చేశారు. ప్లాస్టిక్ కవర్లలో టీ విక్రయిస్తున్న షాపులను గుర్తించామని, వారిని మందలించామన్నారు. మరోసారి ఇటువంటి సంఘట జరిగితే జరిమానాలతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని వారు కోరారు.

విద్యుత్ భారాలు తగ్గించాలి

నరసాపురం: ప్రజలపై మోపిన విద్యుత్ భారాలు తగ్గించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి ఎం.త్రిమూర్తులు డిమాండ్ చేశారు. ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై మోపుతున్న అదనపు భారాలు తగ్గించాలని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ శుక్రవారం స్థానిక విద్యుత్ ఏఈ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా త్రిమూర్తులు మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్‌మీటర్లు పెడితే పగలగొట్టమని చెప్పిన లోకేష్ ఇప్పుడు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కూటి అధికారంలోకి వచ్చిన ఈ 9 నెలల్లో సర్దుబాటు చార్జీలపేరుతో రెండుసార్లు సుమారు రూ.15 వేల కోట్లకు పైనే వినియోగదారులపై భారం మోపారని తెలిపారు. ఏఈ బి.మాధురీదేవికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జల్లి రామ్మోహన్‌రావు, మంచిలి నీలకంఠం, నోముల కొండా తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఉపసంహరణకు డిమాండ్

పాలకొల్లు సెంట్రల్: సెకి విద్యుత్ ఒప్పందం రద్దు చేసి, స్మార్ట్ మీటర్‌లను ఉపసంహరించాలని సీపీఎం మండల కన్వీనర్ జవ్వాది శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఇండోర్ విద్యుత్ కేంద్రం వద్ద ధర్నా చేసి అధికారులకు వినతిపత్రం అందజేశారు. శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు నియంత్రిస్తాం, బిల్లులు భారం తగ్గిస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చి 9 నెలలకే ట్రూ అప్ చార్జీల పేరుతో వేల కోట్లు భారం ప్రజలపై కూటమి ప్రభుత్వం మోపిందని ఆరోపించారు. టైం ఆఫ్ డే చార్జీల వసూళ్ల విధానాన్ని వెనక్కి తీసుకోవాలని, లేదంటే చిరు వ్యాపారులు నష్టపోతారని శ్రీనివాస్ అన్నారు. కార్యక్రమంలో చల్లా సోమేశ్వరరావు, తిరుమాని శ్రీనివాస్, ఎస్ పురుషోత్తం, వై.అజయ్ కుమార్, గుబ్బల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


విద్యుత్‌శాఖ ఏఈకి వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

పీహెచ్‌సీల అభివృద్ధికి నిధులు

భీమవరం: నర్సాపురం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని 8 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మౌలిక వసతుల ఏర్పాటుకు రూ.74 లక్షలను కేటాయించినట్టు బీహెచ్ఈఎల్ సంస్థ ప్రతినిధుల బృందం తెలిపింది. శుక్రవారం విష్ణు కాలేజీలో నిర్వహించిన దిశ సమావేశం అనంతరం జిల్లా కలెక్టర్‌కు ఈ విషయాన్ని వివరించారు. కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ విజ్ఞప్తి మేరకు తాము నరసాపురం నియోజకవర్గంలో పర్యటించామని, సరైన సదుపాయాలు, వైద్య పరికరాలు లేని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సదుపాయాల కల్పనకు నిధులు కేటాయించామని బీహెచ్ఈఎల్ ఏజీఎం మీనా తెలిపారు.

ఓబీసీలకు ప్రాతినిధ్యం కల్పించాలి

పాలకొల్లు సెంట్రల్: ఓబీసీలకు జనాభా దామాషా ప్రకారం అన్ని రంగాల్లోనూ ప్రాతినిధ్యం కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ నాయకుడు ముద్దాడ గణేష్ భవానీ ప్రసాద్ అన్నారు. శుక్రవారం పట్టణంలో నిర్వహించిన బీసీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టి చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, జన, కుల గణన చేయాలని కోరారు. బీసీ రాజకీయ రిజర్వేషన్లు ఏబీసీడీలుగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని రాజకీయ పార్టీల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీలు అన్యాయానికి గురవుతున్నారన్నారు. బీసీలకు పదవుల అవకాశాలు రాకుండా అగ్రవర్ణాల్లో కొందరు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో కోడె యుగంధర్, పొన్నమండ ముత్యాలరావు, పసరల్ మాదవ నారాయణ, ముక్క సత్యనారాయణ, మామిడిశెట్టి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

లంక భూములు దళితులకు పంచాలి

పెనుగొండ: వశిష్ఠా గోదావరి సిద్ధాంతం పెరుగులంక భూములలో మట్టి అక్రమ తవ్వకాలను ఆపి, దళితులకు, పేదలకు పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కేతా గోపాలన్ డిమాండ్ చేశారు. ఆ భూములను శుక్రవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పరిశీలించారు. లంక భూము లు తవ్వకాల వల్ల సీపట్లా భూముల్లో రైతుల సాగుకు ఇబ్బందికరంగా మారుతుందని తెలిపారు. కుసుమే వెంకటేశ్వరరావు, గుమ్మడి రాజు, గెద్దం నాగేశ్వరరావు, గెద్దం ప్రభాకరరావు, రైతులు పాల్గొన్నారు.


సిద్ధాంతం లంకభూముల్లో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

పాలకోడేరు: మండల కేంద్రంలోని సమాఖ్య భవనంలో నిర్వహిస్తున్న బ్యూటీషియన్ కోర్సును జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి శుక్రవారం పరిశీలించారు. బ్యాంకు లింకేజీ, ఉన్నతీకరణపై ఎస్‌హెచ్‌జీ మహిళలకు సెర్ప్ ద్వారా అందజేస్తున్న శిక్షణ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ డీఆర్‌డీఏ, స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్యూటీషిన్ కోర్సును మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ అనంతరం పీఎంఈజీపీ పథకం ద్వారా రూ.10 లక్షల వరకు సబ్సిడీతో కూడిన రుణ సదుపాయాన్ని అందజేయనున్నారని, దీంతో బ్యూటీ పార్లర్ ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. జిల్లాలోని ఒక్కో మండలాన్ని ఎంపిక చేసి జిల్లా అంతటికీ ఒక్కో పథకానికి శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామని, అలాగే వేరొక మండలంలో చెఫ్ శిక్షణ ఇస్తామన్నారు. సెర్ప్ అడిషనల్ డైరెక్టర్, స్పెషల్ ఆఫీసర్ సరళ మాట్లాడుతూ పేద మహిళల జీవన ప్రమాణాల మెరుగునకు ప్రభుత్వం అనేక రుణాలను మంజూరు చేస్తుందన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం.ఎస్ఎస్ వేణుగోపాల్, తహసీల్దారు విజయలక్ష్మి, డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చదలవాడ నాగరాణి

పోడూరుకు రాని ఆర్టీసీ బస్సు

ప్రజలకు తప్పని ఇబ్బందులు

పోడూరు: మండలకేంద్రం పోడూరు గ్రామానికి ఆర్టీసీ బస్సులు రాకపోవడంతో ఆ గ్రామంతోపాటు చుట్టుపక్కల శివారు గ్రామాల ప్రజలకు అవస్థలు తప్పడంలేదు. పోడూరు గ్రామానికి నడిపే ఆర్టీసీ బస్సు సర్వీసులను గతంలో రద్దు చేశారు. కవిటం సెంటర్ నుంచి దాదాపు రెండు కిలో మీటర్ల దూరంలో పోడూరు ప్రధాన గ్రామం ఉంటుంది. గ్రామానికి బస్సులు రాకపోవడంతో పొరుగూళ్లకు వెళ్లడానికి ఆర్టీసీ బస్సులపై ఆధారపడేవారు ఎటువైపు ప్రయాణించాలన్నా కవిటం సెంటర్‌కు రావాల్సిందే. కవిటం సెంటర్‌కు పోడూరు గ్రామానికి ఆటో సర్వీసులుకూడా అంతంతమాత్రమే. పోడూరులోని కల్నల్ డీఎస్ రాజు పాలిటెక్నిక్ కళాశాల ఎంతో ప్రాచుర్యం పొందింది. అలాగే పోడూరులో మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఉంది. గ్రామంలో ఆర్టీసీ బస్టాండ్ కూడా ఉంది. బస్సు సర్వీసులు లేకపోవడంతో పాలిటెక్నిక్ కళాశాలకు వెళ్లే విద్యార్థులు, ఆరోగ్య కేంద్రానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చే పేషెంట్లకు ఇబ్బందులు పడుతున్నారు.


పోడూరులోని కల్నల్ డీఎస్‌రాజు విగ్రహం

వినతులపై స్పందన కరువు

పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు, పీహెచ్‌సీకి వెళ్లే పేషెంట్లు పడుతున్న ఇబ్బందుల నేపథ్యంలో పోడూరు గ్రామానికి ఆర్టీసీ బస్సు నడపాలని గ్రామ సర్పంచ్ శెట్టిబత్తుల సువర్ణరాజు, వైస్ ఎంపీపీ ఇందుకూరి సీతారామరాజు, ఎంపీటీసీ–3 పోడూరి నాగరాజారావు పలుసార్లు మండల పరిషత్ సర్వసభ్య సమావేశాల్లో ఆర్టీసీ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ప్రయాణికుల సంఖ్య తక్కువగా ఉండడం వల్లే బస్‌లు నడపలేకపోతున్నామని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. అయితే రోజుకు కనీసం రెండు సార్లు బస్ సర్వీస్‌లు నడిపితే చాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు.

> **రెండు ట్రిప్పులైనా నడపాలి**
>
> 
>
> మండల కేంద్రమైన పోడూరు జనాభా దాదాపు 10 వేలు. పాలిటెక్నిక్ కళాశాలకు వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు వస్తుంటారు. గ్రామంలోని విద్యార్థులు పెనుగొండ కళాశాలకు వెళుతుంటారు. బస్సు సదుపాయం లేక విద్యార్థులతో పాటు గ్రామస్తులు అనేక అవస్థలు పడుతున్నారు. రోజుకు కనీసం రెండు ట్రిప్పులైనా బస్సులు నడపాలి.
>
> – శెట్టిబత్తుల సువర్ణరాజు, గ్రామ సర్పంచ్, పోడూరు

సంఘటితంగా పోరాడాలి


రమణయ్యను సత్కరిస్తున్న సంఘ నాయకులు

భీమవరం: నాయీ బ్రాహ్మణులు సంఘటితంగా పోరాడాలని అందుకు యువత కృషి ఎంతో అవసరమని ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ ఉద్యోగ సాంస్కృతిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పీవీ రమణయ్య అన్నారు. సమస్యల పరిష్కారం కోసం జిల్లా సంఘంతో పాటు మండల, పట్టణ స్థాయి సంఘాలు మరింత పటిష్ఠంగా ఉండాలన్నారు. అనంతరం సంఘం తరపున రమణయ్యను సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎంవీ సత్యనారాయణ, కార్యదర్శి సీహెచ్ బంగ్గారావు, భీమవరం పట్టణ సంఘం అధ్యక్షుడు మల్లువలస రఘుబాబు, మల్లువలస రాము, వేపాడు పెద్దిరాజు, గోడపువలస ఏసు పాల్గొన్నారు.

పాస్టర్ పగడాల మృతిపై న్యాయ విచారణ జరపాలి

పెంటపాడు: పాస్టర్ పగడాల ఆకస్మిక మృతిపై ప్రభుత్వం తక్షణం న్యాయ విచారణ జరిపి, దోషులైన వారిపై తక్షణం చర్యలు తీసుకోవాలని గూడెం క్రైస్తవ జేఏసీ నేతలు పేర్కొన్నారు. శుక్రవారం ఆయా చర్చిలలో ప్రార్థనల అనంతరం గూడెం రామారావు పేటలోని క్రిష్టియన్‌పేట వీధి ప్రార్థనా మందిరంలో గూడెం క్రైస్తవ జేఏసీ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ సభ్యులు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో యువ ఉజ్జీవ ఆధ్యాత్మిక బోధకుడిగా ఎదుగుతున్న పాస్టర్ ప్రవీణ్ పగడాల హత్యపై నిజాలు నిగ్గుతేల్చాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు మానుకొండ డల్లా, మరనాత ఎలీషా, పాస్టర్ రవికుమార్, శామ్యూల్ మాస్టార్, బేబీ సరోజని, లాల్‌నెహ్రూ, మెండెం జేమ్స్, పాస్టర వినోద్, టైటస్, ప్రసాద్, పాస్టర్ ఎజ్రా శాస్త్రి, దినకరన్, కరుణమ్మ, రాజబాబు, లూక్సన్, శ్యాంబాబు, తదతరులు పాల్గొన్నారు.